nipuna
Every Wednesday Free Supplement
05.
11 సెప్టెంబర్ 2024
పేజీలు 8

### ట్రీ మ్యాన్ అవార్డు

సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్‌కు 'ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ' అవార్డు లభించింది. సింగరేణిని పర్యావరణ అనుకూల సంస్థగా మార్చడంతో పాటు స్వయంగా 18 వేలకు పైగా మొక్కలను నాటి ప్రజల్లో పర్యావరణ స్ఫూర్తిని పెంచినందుకు, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను సృష్టించినందుకు ఈ అవార్డు దక్కింది. జూన్ 29న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ ఈ అవార్డును అందజేసింది.

# సహకార సమాఖ్యకు ప్రతిబింబం నీతి ఆయోగ్

భారత రాజ్యాంగంలో భారత్ అంటే రాష్ట్రాల కలయిక (యూనియన్ ఆఫ్ స్టేట్స్) అని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, వాటిని సమీక్షించడం ద్వారా సహకార పోటీతత్వం కలిగిన సమాఖ్య వ్యవస్థను ప్రోత్సహించే లక్ష్యంతో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు. ప్రభావవంతమైన రాజకీయ నాయకత్వం, సుపరిపాలన వ్యవస్థ వంటి అంశాలు ఆయా రాష్ట్రాల వారసత్వాన్ని తెలియజేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని సంస్థలు, విభాగాల పనితీరు, సామాజిక, ఆర్థిక సవాళ్లను అధిగమించడంలో రాష్ట్రాలు అనుసరిస్తున్న వ్యూహాలు అంతిమంగా దేశ ప్రతిష్టను ప్రతిబింబిస్తాయి.

- స్వాతంత్ర్యానంతరం ఏర్పాటు చేసిన ప్రణాళికా సంఘం దేశాభివృద్ధికి అవసరమైన ప్రగతిరథ చక్రాలను నడిపించడంలో క్రియాశీల పాత్ర పోషించింది. 2015లో ప్రణాళిక సంఘం స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేయడం కొత్త చారిత్రక పరిణామం.
- మహాత్మాగాంధీ పేర్కొన్నట్లు నిరంతర అభివృద్ధి అనేది మానవ జీవన విధానం, పిడివాదాన్ని, మెట్ట సిద్ధాంతాలను గుడ్డిగా అనుసరించే వ్యక్తి అపజయం పొందుతాడు. ఈ భావనను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచ సామాజిక ఆర్థిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారతదేశం నిరంతరం అంతర్గతంగా సంస్కరణలను చేపడుతూనే ఉంది.
- ఆర్థిక వనరుల సహకారంతో ప్రణాళికా సంఘం దేశ అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడే పంచవర్ష ప్రణాళికలను అమలు చేసింది. 2015లో ఏర్పడిన నీతి ఆయోగ్ మేధో సంపత్తి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పౌర సామాజిక సంస్థలు, ప్రైవేట రంగం, పరిశోధన సంస్థలు, నూతన అన్వేషణలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల సమర్థవంతమైన భాగస్వామ్యంతో శరవేగంగా దేశాభివృద్ధి జరిగేందుకు వినూత్న విధానాలను అవలంబిస్తుంది.
- ప్రణాళికా సంఘం రాష్ట్రాలకు నిధులను కేటాయించే సంస్థగా విధులను నిర్వహించింది. రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యంపై ప్రణాళికా సంఘానికి అజమాయిషీ ఉండేది. దీనికి భిన్నంగా నీతి ఆయోగ్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వివిధ రాష్ట్రాలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మేధో సంపత్తిని పంచుకుంటుంది. ఇది ఒక రకంగా నిజమైన సహకార సమాఖ్యకు వెన్నుముక లాంటిది.
- నీతి ఆయోగ్ ఏర్పాటులో తమకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే సాధికారత రాష్ట్రాలకు లభించింది. నిధుల వినియోగం గురించి రాష్ట్రాలపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను దేశ వ్యాప్తంగా అమలు చేశారు. దీనికి భిన్నంగా ప్రస్తుతం నీతి ఆయోగ్ వివిధ రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల ప్రగతికి అనుగుణంగా, సంయుక్తంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తుంది. అనేక అంశాల్లో భిన్నత్వాన్ని కలిగి ఉన్న భారతదేశంలో అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడానికి నీతి ఆయోగ్ క్రియాశీల సాధనంగా ఉపయోగపడుతుంది.




- నీతి ఆయోగ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం, పోటీతత్వంతో కూడిన సహకార సమాఖ్య విధానం, రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడం అంటే పోటీతత్వంతో కూడిన సమాఖ్య విధానం ప్రాతిపదికగా నూతన విధానాలను రూపొందించి అమలు చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి లక్ష్యాలను సమన్వయంతో సాధించడానికి నీతి ఆయోగ్ మార్గదర్శిగా వ్యవహరిస్తుంది.
- నీతి ఆయోగ్ వికేంద్రీకరణ అభివృద్ధి విధానాన్ని దిగువ నుంచి ఎగువకు కార్యక్రమాల అమలు విధానాన్ని అనుసరిస్తుంది. ఫలితంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు టీం ఇండియాలో సమాన భాగస్వాములుగా పరస్పర సహకారంతో ప్రగతిపథంలో ముందుకు సాగుతున్నాయి.
- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, వాటిని సమీక్షించడం ద్వారా సహకార పోటీతత్వం కలిగి ఉన్న సమాఖ్య వ్యవస్థను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివిధ అంశాల పరంగా నెలకొన్న వివాదాలను నేరుగా పరిష్కరించడానికి ఒక ప్రధాన వేదికగా దోహదపడుతుంది. ఈశాన్య రాష్ట్రాల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి 'నీతి ఫోరం ఫర్ నార్త్ ఈస్ట్' అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రాంతీయ ప్రణాళికలను నార్త్ ఈస్ట్ కౌన్సిల్ భాగస్వామ్యంతో నిబంధనలకనుగుణంగా ఐదు మూల సూత్రాల పరిధిలో నీతి ఫోరం అమలు చేస్తుంది.
- ఈశాన్య రాష్ట్రాల నీతి ఫోరం మాదిరిగా ఉమ్మడి సరిహద్దులను కలిగి ఉన్న రాష్ట్రాల కోసం ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి రాష్ట్రానికి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడంలో ఎదురవుతున్న ప్రాంతీయ, ఉమ్మడి సమస్యలు, సవాళ్లను ఈ మండళ్ల ద్వారా పరిష్కరించడానికి వీలవుతుంది. ఇందులో భాగంగా హిమాలయ రాష్ట్రాల ప్రాంతీయ మండలిని ఏర్పాటు చేశారు. ఈ మండలి ప్రాంతంలోని రాష్ట్రాల్లోని 13 కేంద్రీయ విశ్వవిద్యాలయాలను సమన్వయపరిచి సంకీర్ణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. హిమాలయ మండలిలో 13 రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఉమ్మడి సమస్యలపై ఈ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి.
- నీతి ఆయోగ్ రాష్ట్రాల మధ్య పోటీతత్వంతో కూడిన సహకార వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. ఉమ్మడి సరిహద్దులు కలిగిన రాష్ట్రాల అభివృద్ధి సూచీలను ప్రజలకు అందుబాటులో పెట్టడం వల్ల ఈ రాష్ట్రాల్లో విద్య, ఆరోగ్యం, తాగునీటి సదుపాయం, నూతన ఆవిష్కరణలు, ఎగుమతి సన్నద్ధత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు తదితర సూచీల పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందనలు వ్యక్తమవుతున్నాయి.
- హిమాలయ రాష్ట్రాల ప్రాంతీయ మండలి పరిధిలో ఆశావహ జిల్లాల కార్యక్రమాన్ని (అస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ ప్రోగ్రామ్) అమలు చేయడం వల్ల రాష్ట్రాల మధ్య పోటీతత్వం పెరిగింది. ఈ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పాలనను మెరుగుపరిచి వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంచి మానవాభివృద్ధి సూచీని జాతీయ సగటు స్థాయికి అభివృద్ధి చేస్తున్నారు. ఈ జిల్లాల్లో ఆరోగ్య, పౌష్టికాహారం, విద్య, వ్యవసాయం, జల నిర్వహణ, ఆర్థిక సమ్మిళితత్వం, నైపుణ్యాభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాలు వంటి సూచీలను నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తుంది. ఈ జిల్లాల్లో పాలనాపరమైన అంశాల్లో కూడా మెరుగుదల ఉన్నట్లు నీతి ఆయోగ్ గుర్తించింది. ఫలితంగా ఇలాంటి ప్రమాణాలను ఇతర రాష్ట్రాల్లో బ్లాకు స్థాయిలో అమలు చేస్తున్నారు.
- కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయంతో విధానపరమైన సంస్కరణలు అమలు జరిగేలా ప్రోత్సహించడానికి నీతి ఆయోగ్ నిరంతరం కృషిచేస్తుంది. జాతీయ మెడికల్ కమిషన్ బిల్లు, జాతీయ వైద్య విధానం, హోమియోపతి వైద్యవిధానంలో సంస్కరణల బిల్లులను రూపొందించడంలో నీతి ఆయోగ్ క్రియాశీల పాత్ర పోషించింది. ఈ బిల్లుల వల్ల భారతదేశంలో ప్రపంచ స్థాయి వైద్య విద్యావిధానం అందుబాటులోకి రానుంది. అదేవిధంగా ప్రపంచంలో అతిపెద్ద సార్వత్రిక ఆరోగ్య కార్యక్రమంగా గుర్తింపు పొందిన ఆయుష్మాన్ భారత్ పథకం రూపకల్పనలో నీతి ఆయోగ్ ప్రధాన పాత్ర పోషించింది.
- పేదల పౌష్టికాహార స్థాయిని పెంపొందించడంలో ముఖ్యమైన పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమంలో రూపకల్పనలో క్రియాశీల పాత్ర పోషించడంతో పాటు మానవ వనరుల అభివృద్ధిలో పరివర్తనకు సుస్థిర చర్యలు (Sustainable Action for Transforming Human Capital – SATH) కార్యక్రమాన్ని మూడు రాష్ట్రాల్లో అమలు చేయడంలో నీతి ఆయోగ్ క్రియాశీల పాత్ర పోషిస్తుంది. నీతి ఆయోగ్ రూపొందించిన నూతన భారత్ @ 75 కోసం వ్యూహం పత్రంలో అనేక విధానపరమైన సూచనలు ఉన్నాయి.
- కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును, సాధించిన ఫలితాలను నీతి ఆయోగ్‌లోని డెవలప్‌మెంట్ మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేషన్ విభాగం నిర్వహిస్తుంది. అన్ని రాష్ట్రాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి జరుగుతున్న పురోగతిని నీతి ఆయోగ్ పర్యవేక్షిస్తుంది.
- దేశ వ్యాప్తంగా నూతన ఆవిష్కరణలకు అవసరమైన పరిస్థితులను కల్పించడంపై నీతి ఆయోగ్ ప్రధానంగా దృష్టి సారించింది. అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా దేశంలో నూతన ఆవిష్కరణలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధికి నీతి ఆయోగ్ కృషి చేస్తుంది.
- దేశంలోని క్లిష్టమైన సమస్యలను పరిష్కరించి వేగవంతమైన అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కొనసాగడానికి దేశంలోని యువత ఆశయాల సాధనకు రాబోయే మూడు దశాబ్దాల్లో సుస్థిరమైన, సమ్మిళిత వృద్ధికి, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సంస్కరణలను ప్రోత్సహించి విధానపరమైన మార్పులను అమలు చేయడానికి అవసరమైన సంస్థాగత యంత్రాంగాలను ఏర్పాటు చేయడంలో నీతి ఆయోగ్ ఒక బలమైన సాధనంగా ఉపయోగపడుతుంది.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827



4వ పేజీ తరువాయి

**48. క్రమక్షయం వల్ల పర్వత పాదాల వద్ద పడిన ఇసుక రేణువులను ఏమంటారు?**
1) టోర్స్ 2) టాలస్‌కోన్స్
3) బజడా 4) బహడా

**49. 'బ్లో అవుట్'కు సంబంధించిన అంశం?**
1) హిమానీ నదాలు 2) నీటి ప్రవాహం
3) భూగర్భ జలం 4) పవన చర్య

**50. భూకంపం ప్రారంభమైన ప్రదేశాన్ని ఏమంటారు?**
1) అధికేంద్రం 2) భూకంపనాభి
3) ఛాయామండలం 4) కుహరం

**51. కింది వాటిలో సరికానిది ఏది?**
1) భూ భాగంలో అధికంగా ఉన్న భాగం భూ పటలం
2) భూ పటలం సిలికా, అల్యూమినియంతో తయారయ్యింది
3) సముద్ర భూతలం సిలికా, మెగ్నీషియంతో ఉంది
4) భూకేంద్ర మండలం అల్యూమినియంతో ఉంది

**52. కింది వాటిలో రసాయనిక శిలా శైథిల్యం కానిది ఏది?**
1) కార్బొనేటికరణం 2) అపదళనం
3) ఆక్సీకరణం 4) ద్రావణీకరణం

**53. బోల్సన్ అనే సరస్సులు ఏ ప్రాంతాల్లో ఏర్పడతాయి?**
1) శుష్క ప్రాంతాలు 2) రుతుపవన ప్రాంతం
3) మధ్యధరా మండలం 4) టైగా మండలం

**54. కోణీయ శిలలు (Ventifacts) దేనికి సంబంధించినవి?**
1) హిమానీ నదాలు 2) నదులు
3) సముద్ర తరంగాలు 4) పవన చర్యలు

**55. 'కోల్' అనేది దేనికి చెందిన క్రమక్షయ స్వరూపం?**
1) హిమానీ నదాలు 2) నదులు
3) భూగర్భ జలం 4) సముద్ర తరంగాలు

**56. Crevasses అనేది దేనికి చెందిన క్రమక్షయ స్వరూపం?**
1) పవన చర్యలు 2) సముద్ర తరంగాలు
3) ప్రవాహ జలం 4) హిమానీ నదాలు

**57. భూపటల మందం వేటి మధ్య ఉంటుంది?**
1) 5–50 కి.మీ. 2) 10–50 కి.మీ.
3) 5–60 కి.మీ. 4) 10–60 కి.మీ.

**58. వికోశీకరణం (Denudation) సాధారణంగా?**
1) క్రమక్షయాన్ని సూచిస్తుంది
2) క్రమక్షయం, శిలా శైథిల్యాలు, రవాణాను సూచిస్తుంది
3) శిలా శైథిల్యాన్ని సూచిస్తుంది
4) రసాయన శిలా శైథిల్యాన్ని సూచిస్తుంది

**59. $30^0$ రేఖాంశంపై 2 పీఎం అయితే $30^0$ తూర్పు రేఖాంశంపై సమయం ఎంత?**
1) 3 ఏఎం 2) 3 పీఎం
3) 4 పీఎం 4) 6 పీఎం

**60. సరైనది గుర్తించండి?**
1) స్పిట్ అంటే సముద్రంలోకి చొచ్చుకువచ్చిన ఇసుక
2) స్టాలక్‌టైట్ అంటే గుహల పై కప్పుల్లో వేలాడే శిలలు
3) స్టాలక్‌టైట్ అంటే గుహల్లో పాము పుట్ట వలే ఉన్న శిలాకృతి
4) పైవన్నీ సరైనవే

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1-1, | 2-4, | 3-2, | 4-2, | 5-4, |
| 6-4, | 7-1, | 8-3, | 9-2, | 10-1, |
| 11-1, | 12-3, | 13-1, | 14-3, | 15-4, |
| 16-2, | 17-3, | 18-3, | 19-3, | 20-3, |
| 21-2, | 22-3, | 23-3, | 24-2, | 25-2, |
| 26-3, | 27-4, | 28-1, | 29-3, | 30-2, |
| 31-3, | 32-3, | 33-4, | 34-2, | 35-4, |
| 36-1, | 37-2, | 38-1, | 39-4, | 40-1, |
| 41-4, | 42-3, | 43-4, | 44-3, | 45-3, |
| 46-3, | 47-4, | 48-2, | 49-4, | 50-2, |
| 51-4, | 52-2, | 53-1, | 54-4, | 55-1, |
| 56-4, | 57-3, | 58-2, | 59-4, | 60-4. |